ప్రజాశక్తి
గురువారం 29 ఆగస్టు 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - వెంకటాచలం :విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని కళాశాలలను బుధవారం ఉదయం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎస్. విజయ భాస్కర రావు ఆకస్మితంగా తనిఖీ చేశారు. వి ఆర్ న్యాయ కళాశాల, శ్రీ చంద్రారెడ్డి డిగ్రీ కళాశాల, లోని మౌలిక వసతుల పైన, విద్యార్థుల హాజరు, అధ్యాపకుల పనితీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబరేటరీలు, లైబ్రరీ ఇతర వసతుల నాణ్యతను, పరీక్షా విధానం, మరియు విద్యా నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ప్రమాణాలు, పనితీరు మెరుగు పరుచు కోకపోతే కఠిన చర్యలు తీసుకుంటాము అని హెచ్చరించారు. విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ ఎం ఉస్సేనయ్య ఉన్నారు

వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలి

❍నిమజ్జనాల సమయంలో పటిష్ట బందోబస్త్

❍ శాంతిభద్రతలపై అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష

అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

ప్రజాశక్తి-నెల్లూరు

సెప్టెంబరు 7న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని అధికారులందరూ సమన్వయంతో పనిచేసి నగరంలో నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ సూచించారు.బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వినాయక చవితి నిమజ్జన ఉత్సవాల నిర్వహణపై జేసీ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా నగరంలోని ఇరుగాళమ్మ గుడి వద్దనున్న గణేష్ ఘాట్, రంగనాయకులపేట వద్దనున్న పెన్నా ఘాట్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై శాఖల వారీగా జాయింట్ కలెక్టరు సమీక్షించారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇరుగాళమ్మ గుడి, పెన్నానది ఘాట్ల వద్ద చేపడుతున్న ఏర్పాట్లను అడిషనల్ కమిషనర్ శర్మద, ఈఈ చంద్రయ్య జెసికి వివరించారు. ఘాట్ల వద్ద రూ.1.60 కోట్లతో సివిల్ వర్క్స్ చేపడుతున్నట్లు చెప్పారు. రెండు ఘాట్ల వద్ద రిసెప్షన్ సెంటర్ల ఏర్పాటు, తాగునీటి స్టాళ్ల ఏర్పాటు, బారికేడిరగ్, హైడ్రాలిక్ క్రేన్లు, గ్రాన్యెట్ రిపేర్లు, రోడ్ల ప్యాచ్ వర్క్సు, మొబైల్ టాయిలెట్స్, ఎల్ఈడి లైటింగ్, ఫ్లడ్ లైట్లు, సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, పెయింటింగ్, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టం, సాంస్కతిక కార్యక్రమాలకు స్టేజి నిర్మాణాలు మొదలైన ఏర్పాట్లను చేపడుతున్నట్లు కార్పొరేషన్ అధికారులు జేసీకి వివరించారు. ఇరుగాళమ్మ గణేష్ ఘాట్ ప్రాంతాన్ని 6 జోన్లు, పెన్నా ఘాట్ ప్రాంతాన్ని 5 జోన్లుగా విభజించి మూడుషిఫ్టుల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు ఈఈ చంద్రయ్య చెప్పారు. జెసి మాట్లాడుతూ సెప్టెంబర్ నెల 7వ తేదీన వినాయకచవితి పర్వదినం మొదలుకానుందని, తొలిరోజు నుంచే ఘాట్ల వద్ద విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు సిద్ధంగా ఉండాలన్నారు. వినాయక చవితి మొదలైన మొదటి రోజు 7వ తేదీ, మూడో రోజు 9వ తేదీ, ఐదో రోజు 11వ తేదీన సామూహిక నిమజ్జనం చేయడానికి ఎక్కువ సంఖ్యలో విగ్రహాలు వచ్చే అవకాశం వున్నందున అందుకు తగ్గట్లుగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎక్కువ కెపాసిటీ గల క్రేన్లను ఘాట్ల వద్ద అందుబాటులో వుంచాలని ఆదేశించారు. విగ్రహాల ఏర్పాటు, విద్యుత్, మైక్ పర్మిషన్లు ఎప్పటిలాగా ముందుగా తీసుకోవాలని, సెప్టెంబర్ 5వ తేదీలోగా అనుమతులకు దరఖాస్తులు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. నిమజ్జనానికి విగ్రహాలు తరలించే 8 మార్గాల్లో విద్యుత్ తీగలు విగ్రహాలకు అడ్డురాకుండా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఘాట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులను జేసీ ఆదేశించారు. ఘాట్ల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా గజ ఈతగాళ్లను, పడవలను అందుబాటులో ఉంచాలని ఫైర్, మత్స్యశాఖ అధికారులకు సూచిం చారు. నగరంలో విగ్రహాల నిమజ్జనం సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకోవాలని ఎఎస్పీలకు సూచించారు. ఘాట్ల వద్ద మెడికల్ క్యాంపులు, అంబు లెన్స్‌లు ఏర్పాటు చేయాలని డిఎంఅండ్‌హెచ్‌వోకు సూచించారు. విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల సూచనలను కూడా జేసీ పరిగణలోనికి తీసుకుని, అందుక నుగుణంగా అధికారులకు ఆదేశాలిచ్చారు. ఎఎస్పీలు సౌజన్య, శ్రీనివాసరెడ్డి, డిఆర్‌వో లవన్న, అడిషనల్ కమిషనర్ శర్మద, విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్, డిఎంఅండ్‌హెచ్‌వో పెంచలయ్య, జడ్పీ సిఇవో కన్నమనాయుడు, ఆర్ అండ్ బి ఎస్ఈ గంగాధర్, కార్పొరేషన్ ఈఈ చంద్రయ్య, ఆర్డీవో మలోల, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పిట్టి సత్య నాగేశ్వరరావు, సురేంద్రరెడ్డి, ఎవిఆర్ మోహన్‌రావు, శ్రీకాంత్, బయ్యా వాసు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి

నెల్లూరు : సార్డ్, గ్రామాలయ ఆధ్వర్యంలో " డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా" ప్రాజెక్ట్ లో భాగంగా మండల పరిధిలో ఎన్నిక చేయబడిన పాఠశాలల ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దర్గామిట్టలో ఒకరోజు హ్యాండ్ వాష్ మీద అవగా హన సదస్సు ఏర్పాటు చేశారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్ బాబు హాజరైయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తి గత పరిశుభ్రత, ఆరోగ్యం పై దష్టి సారించాలనీ బాత్రూం, మరుగు దొడ్లు, ప్రతీరోజూ 2 సార్లు ఆయాలచే శుభ్రం చేయించాలన్నారు. మండల అర్బన్ విద్యాశాఖ అధికారి 2 సయ్యద్ హమీద్ అమీర్ మండల రూరల్ విద్యాశాఖ అధికారి 2 మురళీధర్ మాట్లాడారు. డిబిఎస్ఐ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ కుమారి కార్యక్రమం విధివిధానాలు గురించి వివరి స్తూ ప్రెజెంటేషన్‌చేశారు. రిసోర్స్ పర్సన్ గా జి ప్రసాద్ వ్యవహరించారు. పాల్గొన్న అందరికీ ముఖ్య అతిథులు సర్టిఫికెట్లు అంద జేశారు. డి బి ఎస్ ఐ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విష్ణు వర్ధన్, వలంటీర్లు ఈశ్వరయ్య,శివకుమార్ ఉన్నారు.

ఎంఎల్ఎల ఆత్మీయ పలకరింపు

ప్రజాశక్తి-కందుకూరు : బుధవారం సాయంత్రం కందుకూరు టిడిపి కార్యాలయానికి చీరాల ఎంఎల్ఎ ఎం.ఎం.కొండయ్య వచ్చారు. అయనకి కందుకూరు ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ఆత్మీయ స్వాగతం పలికారు .వారిద్దరు టిడిపి కార్యలయంలో కొద్దిసేపు మాట్లాడుకున్నారు

ఉపాధ్యాయులకు

మరుగుదొడ్ల ఫొటోలు అప్‌లోడ్ బాధ్యత సరికాదు :యుటిఎఫ్

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

ఉపాధ్యాయులకు మరుగుదొడ్ల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసే బాధ్యతను తొలగించాలని కోరుతూ డిఇఒ రామారావుకు యుటిఎఫ్ జిల్లా కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. బుధవారం నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డిఇఒను కలిసిన యుటిఎఫ్ సంఘం నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన కాకుండా వర్క్ అడ్జస్ట్ మెంట్ పేరుతో మరే ఇతర పనుల అప్పజెప్పరాదన్నారు. మండల స్థాయిలో ఉపాధ్యాయ్యల సమస్యలకు సంబంధించి అధికారులు స్వీకరించిన వినతిపత్రాలను పరిశీలించి తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలకు పరిష్కారం చూపిన అనంతరం డివిజన్ స్థాయి పనులను ఉపాధ్యాయులకు సర్దుబాటు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు తాను కృషి చేస్తామని డిఈఒ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్. నవ కోటేశ్వరరావు,జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతి శర్మ, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎం.సి. అచ్చయ్య, జిల్లా కోశాధికారి ఎ. మురళీధర్ రావు, జిల్లా కార్యదర్శి కె. నాగిరెడ్డి, ఎస్‌కె. ఖాజావలి, ఎన్. సురేంద్రబాబు, జిల్లా కమిటీ సభ్యులు ఎస్‌కె. జమీర్ అహ్మద్ ,బి. పార్వతీశం,మండల నాయకులు వి. శీనయ్య, ఎస్‌కె.రియాజ్, తిరుపాలు, ఎస్.సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలంలోని విఆర్ కోట మన్నేరు నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని గుడ్లూరు సి ఎం. మంగారావుకు మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు సమాచారం వచ్చింది. దీంతో విఆర్ కోట మన్నేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న అయిదు ఇసుక ట్రాక్టర్లను సిఐ ఆధ్వర్యంలో లింగసముద్రం ఎస్ఐ ఎం బాజీ బాబు తన సిబ్బంది సహాయంతో విఆర్ కోట గ్రామ శివారులో అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ల పై కేసు నమోదు చేశారు.

మహిళల భద్రతకు చర్యలు

ప్రజాశక్తి -ఉలవపాడు : మహిళల భద్రతపై రాజీపడబోమని ఉలవపాడు ఎస్ఐ కె అంకమ్మ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణా, గంజాయి, మద్యం బెల్ట్ షాపులు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పని ఆయన తెలిపారు. మండల ప్రజలకు 24 గంటలు పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు. ఎలాంటి సమస్యలు వున్నా నేరుగా తనను కలిసి న్యాయం పొందవచ్చని తెలిపారు.

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సిఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల కందుకూరు సిఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావు పట్టణంలో ప్రజలు ట్రాఫిక్ సమస్యతో పడుతున్న ఇబ్బందులను పరిశీలించారు. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారానికి తన సిబ్బందితో ప్రయత్నాలు ప్రారంభించారు సిఐ స్వయంగా ట్రాఫిక్ రద్దీగా ఉండే పోస్ట్ ఆఫీస్ సెంటర్లో నిలబడి ట్రాఫిక్ కంట్రోల్ చేస్తున్నారు.

ఎస్ఐ అంకమ్మకు అభినందనలు

ఉలవపాడు : మండల నూతన ఎస్ఐగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన కె. అంకమ్మను బుధవారం ఉలవపాడు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ సర్పంచి ఎన్. పోతురాజు, మండల సభ్యులు షేక్ ఖాదర్ బాషా, చాగల్లు గ్రామ పార్టీ నాయకులు లతా చంద్రశేఖర్ ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

కాపు సంఘం నియోజకవర్గ మహిళా కన్వీనర్‌గా ఉష

ప్రజాశక్తి-కందుకూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు సేవా సంఘం కందుకూరు నియోజకవర్గం మహిళా కన్వీనర్ గా బుధవారం రాష్ట్ర కాపు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర జాతీయ నాయకులు తోట లక్ష్మీనారాయణ, మల్లెల శివ నాగేశ్వరరావు లు కందుకూరు నియోజకవర్గ మహిళ కన్వీనర్‌గా మద్దెల ఉషాను నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ నేటి నుంచి సంఘం అభివద్ధికి పాటుపడాలని తెలిపారు. రాష్ట్ర జాతీయ నాయకులకు అమె కతజ్ఞతలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర నాయకులు సహాయ సహకారాలతో కాపు సంఘ అభివద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

చెరువులను పరిరక్షించాలి

ప్రజాశక్తి-నెల్లూరు : కావలి ప్రాంతంలో భూ బకాసురల కోరలల్లో చిక్కుకొని ఆక్రమణలకు గురౌతున్న చెరువును పరిరక్షించేందుకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని అవసరమైతే హైదరాబాద్ తరహా హైడ్రా చట్టాన్ని అమలులోకి తీసుకురావాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు. బుధవారం ఆర్‌డిఓ కార్యాలయం వద్ద చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించి ఆర్‌డిఓకి వినతిపత్రం అందచేసారు. సాదు ప్రసాద్, శ్రీనివాసులు, జరుగుమల్లి దయాకర్, నారుబోయిన లక్ష్మి నర్సు, జరుగుమల్లి ఆనందరావు ఉన్నారు.

ఇసుక కొరత సమస్యను పరిష్కరిస్తాం..

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో ప్రజలకు ఇసుక కొరత రానీయకుండా అన్ని కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ కె. కార్తిక్ పేర్కొన్నారు.జిల్లాలో గుర్తించిన ప్రదేశాల్లో ఇసుక డీసిల్టేషన్ ప్రక్రియను చేపట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేసిన వారితో జాయింట్ కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో సమావేశమయ్యారు. టెండరింగ్ విధా నంతో ఆలస్యమై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారనే ఉద్దేశంతో, ఇసుక డీసిల్టేషన్ ప్రక్రియను చేపట్టేందుకు ఆసక్తి ఉన్న వారితో యంప్యానల్ లిస్టు తయారు చేసామన్నారు. మైన్స్ ఉప సంచాలకులు శ్రీనివాసరావు , డి టి సి చందర్ , ఇరిగేషన్ అధికారులు, ఉన్నారు.

జనసేన కార్యాలయంలో అర్జీలు స్వీకరణ

నెల్లూరు : పేదలకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జనసేన పార్టీ సీనియర్ నేత, కోఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక గోమతి నగర్ లోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం మల్లికార్జున యాదవ్ మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పేద ప్రజలకు మేలు చేయాలని అనేక పథకాలను, వివిధ సంక్షేమ కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో యస్ ఎ జమీర్, గునుకుల కిషోర్,శేఖర్ రెడ్డి, లాయర్ శ్రీరామ్, రాజేష్ లాయర్,సుభాషిణి లీగల్, శరత్ లీగల్, మరియు జనసేన నాయకులు కార్యకర్తలు వీర మహిళలు పాల్గొన్నారు.

ఇఒ ఆరోపణలు సరికాదు

నెల్లూరు : వెంకటాచలం మండలం, గొలగమూడిఋశ్రీతీ భగవాన్ వెంకయ్యస్వామి ఆలయంలో జరిగిన 42వ ఆరాధన మహోత్సవం కార్యక్రమంలో వెంకయ్య స్వామి కుటుంబసభ్యులైన తమపై ఆలయ ఇఒ బాలసుబ్రహ్మణ్యం దురుసుగా ప్రవర్తించారని సోంపల్లి పెంచలయ్య ఆరోపించారు. బుధవారం జిల్లా జర్నలిస్ట్ భవనంలో ఆయన విలేకర్ల సమావేశంలో వాపోయారు. ఇఒ బాల సుబ్రమణ్యం తమపై లేనిపోని ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. తన అధికారం నిలుపుకునేందుకు తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.. తాము ఎల్లప్పుడూ స్వామి వారి సేవలోనే ఉండేవారుమని వివరించారు.

గుడ్లూరు మెయిన్ బజారులో ఆక్రమణలు

ట్రాఫిక్ జామ్‌తో వాహనచోదకుల అవస్థలు

ప్రజాశక్తి-గుడ్లూరు :

గుడ్లూరు మెయిన్ బజా రుకు ఇరువైపులా వ్యాపారులు ఇష్టారాజ్యంగా ఆక్రమించుకొని భవనాలు నిర్మించడంతో 40 నుంచి 60 అడుగులు వెడల్పు ఉండాల్సిన బజారు రోడ్డు 20 అడుగులకి కుంచించ ుకుపోయింది. కొన్ని సెంటర్లలో 27 అడుగులు కూడా లేకపోవడంతో వందలాది వాహనాలు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోతున్నాయి. గంటల తరబడి ప్రజలు అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. వ్యాపారులు కొందరు పోటా పోటీగా సైడు కాలువలను సైతం ఆక్రమించి భవనాలు నిర్మించడంతో వాహనదారుల అవస్థలు పడుతున్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి శివాలయం వరకు అర కిలోమీటర్ దూరం రహదారి స్థలాన్ని ఆక్రమించుకొని వ్యాపారా లావాదేవీలు జరుపుతున్నారు. గుడ్లూరు మండల కేంద్రానికి సమీపంలో ఉన్న 10 గ్రామాల ప్రజలు నిరంతరం నిత్యావసర వస్తువుల కోసం గుడ్లూరు చేరకుని వస్తువులు ,కూరగాయలు కొనుగోలు చేస్తారు. వందలాది మంది రైతులు ఎరువులు ,పురుగు మందుల కోసం మెయిన్ బజార్లో ఉన్న షాపులు దగ్గర కొనుగోలు చేయాల్సి వస్తుంది. దుస్తుల దుకాణాలు సైతం మెయిన్ బజారర్‌లోనే ఉండటంతో వినియోగదారులతో నిరంతరం రద్దీగా ఉంటుంది. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వివిధ రకాల దుకా ణాలు వినియోగదారులతో కిక్కిరిసి ఉండ డంతో రహదారిలో ద్విచక్ర వాహనాలు ఆటోలు కార్లు ఎక్కడికక్కడ నిలిచి పోవటం వల్ల తరచుగా ట్రాఫిక్ జామ్ జరుగు తోంది. ఆక్రమణలు తొలగించాలని అనేకసార్లు మండల ప్రజలు డిమాండ్ చేయడం తో అధికారులు ఎట్టకేలకు రంగంలో దిగి రోడ్డుకి ఇరువైపులా మార్కింగ్ వేశారు. కనీసం 30అడుగులు మెయిన్ బజార్ ఉండే విధంగా అధికారులు ప్రయత్నాలు చేస్తూ ఉండగానే కొందరు వ్యాపారులు కోర్టు నుంచి స్టేట్ తీసుకు రావడంతో ప్రస్తుతానికి రోడ్డు విస్తరణపనులు ఆగిపోయాయి. దీంతో ఆక్రమణదారులకి మరింత అవకాశం ఎక్కడ ఉందో మరి అంత ముందుకు వచ్చి నిర్మాణాలు చేపట్టడంతో పాదచార్లు సైతం అవస్థలు పడుతున్నారు. ఇటీవల ప్రజా ప్రతినిధులు కార్లు సైతం ట్రాఫిక్ లో చిక్కుబడి పోవడంతో చిరు వ్యాపారులు తోపుడుబండ్లతో జీవనం సాగిస్తున్న వారిపై పోలీసులు ప్రతాపం చూపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు అధికారులు సమిష్టిగా గుడ్లూరు మెయిన్ బజార్ లో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు పూలు కోవాలని సిపిఎం నాయకులు జి వెంకటేశ్వర్లు ,మద్దిశెట్టి జాలయ్య దామా కష్ణయ్య, పొట్లూరు రామచంద్రయ్య ,కే వెంకయ్య ప్రజాసంఘాల నాయకులు అధికారులకు ఈ విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదాలకు నిలయంగా మ్యాన్‌హోల్..

రెండు నెలలుగా మూత లేని వైనం

ప్రమాదభరితంగా ఉన్న మ్యాన్ హోల్

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణం తూర్పు సాలిపాలెం వద్ద ఉన్న మెయిన్ రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ మ్యాన్ హోల్‌పై మూత పెట్టలేదు. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. దాదాపు రెండు నెలల కిందట డ్రెయినేజీలో పూడికలు తీయడం కోసం మ్యాన్ మ్యాన్‌హోల్ మూతన తొలగించారు. తూర్పు సాలిపాలం వద్ద ఉన్న డ్రెయినేజీ మ్యాన్ హోల్‌ను పగలగొట్టారు. దానిపై తిరిగి మూత వేయడానికి మూతలు లేవు ప్రమాదాలు జరుగుతున్నాయి. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చెత్త బండ్లను మ్యాన్ హోల్ పక్కనే కొద్ది రోజులు పెట్టారు. చెత్త బండి ఉన్నన్ని రోజులు ప్రమాదాలు పెద్దగా జరగలేదు. ఆ తర్వాత చెత్త బండిని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తీసివేశారు. పాదచారులు, వాహన చోదకులకు అక్కడ మ్యాన్ హోల్‌పై మూత లేదనే విషయం తెలియక అందులో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు ఈ చిన్న పని విషయంలో చేస్తున్న నిర్లక్ష్యం వల్ల ప్రజల చీత్కారాలకు గురవు తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిం చాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించండి..

అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరరావు

ప్రజాశక్తి - లింగసముద్రం

అధికారులు గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి ప్రజాప్రతినిధులు చెప్పిన సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని ఎంపిడిఒ పెన్నా కష్ణయ్య చెప్పారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. గ్రామంలో జలజీవన్ మిషన్ పనులు జరుగుతున్న తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని విశ్వనాధపురం సర్పంచ్ బొల్లినేని నాగేశ్వరరావు డబ్ల్యుఎస్ ఏఈని ప్రశ్నించారు. గ్రామంలో పూర్తిస్థాయిలో ఇళ్లకు కుళాయిలు నిర్మించకుండా పనులు ముగించే విధంగా చర్యలు తీసుకోవడం ఏమిటని అడిగారు ప్రతి ఇంటికి కులాయి బిగించాలని చెప్పారు. గ్రామపంచాయతీలో సర్పంచ్లు ఉన్నప్పటికీ పంచా యతీలో పనులను వేరే వారి చేత ఎలా చేయిస్తారని పలువురు సర్పంచులు ప్రశ్నించారు. సర్పంచులకు ఎంపీటీసీలకు తెలియకుండా పనులు చేయించొద్దని మండల స్థాయి అధికారులకు మండల పరిషత్ అధ్యక్షులు పెన్నా కష్ణయ్య చెప్పారు. మెదరమెట్ల పాలెం గ్రామంలో నీటి సమస్య ఉందని దాన్ని తక్షణమే పరిష్కరించాలని అధికారులు కోరారు. మండల పరిషత్ అభివద్ధి అధికారి కట్టా శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ పి ప్రసాద్ పాల్గొన్నారు.

మెస్, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలి : ఎఐఎస్ఎఫ్

నెల్లూరు : రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గహాల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. బుధవారం పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గ్రహాల్లో చదువుతున్న పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు గత ఏడు సంవత్సరాల నుండి ట్రంకు పెట్టెలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వాలు పాలన సాగిస్తు న్నాయన్నారు. 2023నవంబర్ నెల నుండి మెస్, కాస్మోటిక్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. . నెల రోజుల్లో సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే ఛలో సచివాలయానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్ కిషోర్, నగర అధ్యక్షుడు శివం వర్మ,జిల్లా నాయకులు ప్రసాద్, అబ్దుల్, జాహ్నవ్,ఎస్దాన్ని,నరసింహ, శరణ్ , జీవన్, సుకుమార్ ఉన్నారు.

జ్వరాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని చంద్రమౌళి నగర్ యుపిహెచ్‌సి పరిధిలోని పోలీస్ కాలనీ సచివాల యం ప్రాంతంలో డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదు కావడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది బుధవారం లార్వా సర్వే, ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సర్వే కార్యక్రమం డిఎంఒ హుస్సేనమ్మ పర్యవేక్షణలో వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. ఏఎంఒ వి నాగార్జున రావు, ఎస్ యు ఓ జయరాం ,సాంసన్ బాబు, రామారావు , ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీధర్, ఆరోగ్య సహాయకుడు నందకుమార్ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు :నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోనీ జేమ్స్ గార్డెన్ ప్రాంతంలో ఏపి పవన్ కళ్యాణ్ అభిమాన సాంఘ అధ్యక్షులు , జిల్లా జనసేన పార్టీ సీనియర్ నాయకులు టోనీ బాబు ఆధ్వర్యంలో 7 రోజుల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారి జన్మదిన వారోత్సవాలలో భాగంగా రెండో రోజు మున్సిపల్ కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. వారి సేవలను అభినందించి వారికి శాలువాలతో సన్మానించారు. బుధవారం చేపట్టిన ఈ కార్యక్రమంలో టోనీ బాబుమాట్లాడారు. జిల్లా ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ షాన్వాజ్, సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు కాకి శివ కుమార్ ఉన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు : ఇంటూరి

ప్రజాశక్తి వలేటివారిపాలెం :పేదలకు సకాలంలో వైద్య సేవలు అందిచడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం అని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. వలేటివారిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేషనల్ హెల్త్ మిషన్ పథకం కింద మంజూరైన రూ. 50 లక్షలతో ల్యాబ్ భవనానికి ఎంఎల్ఎ టుబాకోబోర్డు వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబుతో కలిసి బుధవారం శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆసుపత్రిలోని కాన్పులగది. వార్డు గది, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ గది, ల్యాబ్ గది, డాక్టర్లు గదులతో పాటు పరిసరాలను పరిశీలించారు. మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఎల్ఎ నాగశ్వరరావు మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలు రకరకాల పరీక్షలు నిమ్మితం దూరప్రాంతాలలోని పట్టణాలకు వెళ్లేందుకు ఆర్థిక స్థోమత లేక పడుతున్న ఇబ్బందులను దషిలో పెట్టుకొని వలేటివారిపాలెంలో అన్ని రకాల రక్తపరీక్షలు నిర్వహించేందుకు అనుగుణంగా ల్యాబ్ భవనం ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ వలేటి నరసింహం, వైద్యులు మణిదీపిక, శ్రీనివాసరావు, శివప్ప ఎంపీడీఓ శేషుబాబు, తహసీల్దార్ అబ్దుల్‌అమీర్. ఎ ఆర్‌అండ్బ డీఈ మస్తాన్రావు. చెరువుపల్లి మాల్యాద్రి, ఎంపీటీసీ భర్త వలేటి నరసింహం, నవ్వులూరి రాజారమేష్ సాధు శ్రీలత, వలేటి మధుసూధన్ రావు న్యాయవాది వలేటి శ్రీధరనాయుడు, దామా మల్లేశ్వరరావు పిడికిటి వెంకటేశ్వర్లు, నార్నె రోశయ్య, వేముల గోపాల్రావు, కాకుమాను ఆంజనేయులు ఉన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ
ఇంటూరి నాగేశ్వరరావు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి -వలేటివారిపాలెం :బైక్‌పై వెళ్తున్న యువకుడిని అడవిపంది తగలడంతో తీవ్రగాయాలైన సంఘటన మండల కేంద్రమైన వలేటివారిపాలెంలోని తూమలేరు సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో జరిగింది. ఆ ప్రమాదంలో మండలంలోని అయ్యవారిపల్లెకు చెందిన ముచ్చు సుబ్బారావుకు తల పగిలి తీవ్ర గాయాలయ్యాయి. సుబ్బారావు వలేటివారిపాలెంలో కిరాణా దుకా ణంలో పని ముగించుకొని తిరిగి అయ్యావారిపల్లెకు బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అడవిపంది అక్కడికక్కడే మృతిచెందింది. ఆ ప్రమాదంలో సుబ్బారావుకు తల పగిలి తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే 108 వాహనంలో కందుకూరు ప్రేవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. అక్కడి నుంచి గుంటూరు తరలించారు.

అర్ధరాత్రి దొంగలు హల్‌చల్..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండలంలోని మాచర్లవారిపాలెంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారరు. గ్రామస్తులు దొంగలను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. నెల్లూరు బోడిగాడితోత ప్రాంతానికి చెందిన కొందరు మంగళవారం చిత్తుకాగి తాలు ఏరుకొనే వారిలా గ్రామంలో సంచరించారు. అనంతరం అర్ధరాత్రి వారే ఓ ఆటోలో మళ్లీ గ్రామంలోకి వచ్చిన పొలాల్లోని విద్యుత్ మోటార్లను, ఓ మోటార్ బైక్ ను దొంగిలించారు. ఈ విషయాన్ని పసిగట్టిన గ్రామస్తులు దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వారి నుంచి నుంచి రెండు విద్యుత్ మోటార్లను, ఒక బైక్ ను, వా రు వేసుకొని వచ్చిన ఆటోను స్వాధీనం చేసుకొన్నారు. వీరంతా పాత నేరస్తులని తేలింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐగా వీరేంద్ర బాబు బాధ్యతలు స్వీకరించిన రోజే చోరీ ఘటనతో స్వాగతం పలకడం పట్ల మండలంలో ఆసక్తికర చర్చ నడుస్తోంది.

అధ్యాపకులను నియమించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గుడ్లూరు : గుడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటర్ జూనియర్ కళాశాల్లో లెక్చర్లనులను నియమించకపోవడంతో పాఠ్యాంశాలు బోధించేవారు లేక విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఈ ఏడాది జూన్ నెలలో ప్రభుత్వం నూతనంగా ఇంటర్ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసింది. ఈ పాఠశాలలో 41 మంది విద్యార్థులు చేరారు. పాఠశాలలో చేరిన విద్యార్థులకు పాఠ్యాంశాలు చెప్పేవారు లేక లెక్చర్ల కోసం విద్యార్థులు వెదురు చూపులు చూస్తూ ఉన్నారు. అధికారులకి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా లెక్చర్లలను నియమించకపోవడంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టి అధికారులకు వినస పత్రం సమర్పించారు. ఇప్పటికైనా పాఠశాలకి లెక్చర్లను నియమించాలని డిమాండ్ చేశారు.

తైక్వాండో పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు : ఈ నెల 31 నుండి సెప్టెంబర్ 1 వ తేదీ వరకు ఖేలో ఇండియా టోర్నమెంట్ తిరుపతి లో రెండు రోజులు జరిగే కార్యక్రమములో కందుకూరు కోటారెడ్డి నగర్ శ్రీ చైతన్య టెక్నో స్కూలు లో 8వ తరగతి చదువుచున్న కె.అస్మిత హర్షల్ అనే విద్యార్థిని ఎంపిక అయినది. ప్రకాశం జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ తైక్వాండో వైస్ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ సలామ్, కోచ్ అఖిల్ ఆధ్వరంలో అస్మిత హర్షల్ అనే విద్యార్థిని తిరుపతి లో జరిగే రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా టోర్నమెంట్లో పాల్గొన బోతుంది. ఈ కార్యక్రమములో శ్రీ చైతన్య హైస్కూలు ప్రిన్సిపల్ బి.సురేష్ , అర్ఐ అనిల్ కుమార్, కోఆర్డినేటర్ శ్రీనివాసులు , అకడమిక్ డీన్ బ్రహ్మయ్య , విద్యార్థిని తల్లితండ్రులు ఎఒ సురేష్ నాయుడు, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ సిబ్బంది ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయిన విద్యార్థిని అభినందించారు.

నరసింహులు రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి కోవూరు: చదువు పట్ల ఉన్న ప్రత్యేకమైన మమకారంతో గత 17 సంవత్సరాలుగా పాఠశాలలో ఉత్తమమైన మార్కులు సాధించిన విద్యార్థులకు క్రమం తప్పకుండా వారికి ప్రోత్సాహక నగదు బహుమతి ఇస్తున్న మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శివుని నరసింహులు రెడ్డి సేవలు ఇతరులకు స్ఫూర్తిదాయకమని తహశీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జాలికొన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం ఇటీవల 10వ తరగతి పరీక్షల్లో మండల టాపర్‌గా నిలిచి ఉత్తమ మార్కులు సాధించిన 19 మంది విద్యార్థినులకు లక్ష రూపాయల మేర దాతల సహకారంతో ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకుని తల్లిదండ్రుల ఆశయాలను అనుగుణంగా దానిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. దాతలు ఇచ్చిన ప్రోత్సాహాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ శ్రీహరి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో పోటీతత్వం, లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతి విద్యార్థిలో పదవ తరగతి అనేది కీలకమని, ఈ దశలో కేవలం మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ధ్యాస తప్ప వేరే ఆలోచన ఉండరాదన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను పూర్తిగా ఆకళింపు చేసుకుని మంచి మార్కులు సాధించాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. నూరుశాతం ఫలితాల సాధనే ధ్యేయంగా ప్రతి విద్యార్థి ఒక పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఝాన్సీ రాణి, తదితరులు ప్రసంగించారు.

నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

చదువుతోనే లక్ష్యాల్ని సాధిస్తాం

ప్రజాశక్తి-బిట్రగుంట: విద్యార్థులు చదువులతోనే లక్ష్యాలను సాధిస్తారని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. బోగోలు మాజీ సర్పంచ్ బోగిరి మణెమ్మ జ్ఞాపకార్థంగా వారి కుమారుడు కావ్య యువసేన అధ్యక్షుడు బోగిరి ప్రభాకర్ రైస్ బ్యాగులు ,జమ్మి రైతు రిపోర్టర్ ఆరిఫ్ జ్ఞాపకార్థంగా వారి కుమారుడు కావ్య యువసేన ఉపాధ్యక్షుడు ఎస్, డి ,సుభాని కూరగాయలను బోగోలు మండలం కప్పరాల తిప్ప గ్రామంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుధీర ప్రాంతాల నుండి చదువుల కోసం ప్రభుత్వ కళాశాలలకు వస్తూ మధ్యాహ్నం భోజనం చేయకుండా కష్టపడి చదువుతున్నారని, వారి కోసం కావ్య కష్ణారెడ్డి యువసేన యువత సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఆకలితో ఉన్న విద్యార్థుల కోసం బియ్యం ,కూరగాయలను అందిస్తున్న బోగోలు మండల కావ్య యువసేన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యువసేన కార్యకర్త గోచిపాతల సంజయ్, బిజెపి మండల అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు, కళాశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిధులు గోల్మాల్ పై విచారణ..

ప్రజాశక్తి -వరికుంటపాడు :మే 13న జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో ప్రతి పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాట్లు చేసేందుకు సిబ్బంది భోజనాలకు వాటి అన్నిటికి కలిపి 5వేల రూపాయల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది.ఏర్పాటు చేసిన నిధులు బిఎల్ఓలకు ఇవ్వాల్సి ఉంది. వారిలో కొంతమంది కి మాత్రమే ఇచ్చి కొంతమంది కి ఇవ్వలేదని అప్పటి ఎంపిడిఓ తోట వెంకట క్రిష్ణ కుమారి పై అధికారులకు ఫిర్యాదు అందడంతో ఆ మేరకు బుధవారం డిఎల్‌పిఓ కృష్ణ మోహన్ విచారణ చేశారు.బిఎల్ఓ లను విచారించి ఎవరికీ ఎంత నగదు అందాయి, ఎవరికి అందలేదు అనే దానిపై రాత పూర్వకం రాయించుకొని ఆ అర్జీని తీసుకొని ఉన్నంతధికారుల దృష్టికి తీసుకొని వెళ్తానని వెళ్లిపోయారు. రామాపురం బిఎల్ఓ ప్రభుదాసు ఈ నగదు విషయం పై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిఉన్నాడు.డిఎల్‌పిఓ ఎటువంటి అవకతవకలు జరగలేదని అతని పై ఒత్తిడి తీసుకువచ్చారు. దానికి ఆ బిఎల్వో ఒప్పుకోలేదని తెలిపారు. రాత పూర్వకంగా రాయించుకున్న స్టేట్ మెంట్ కి బిఎల్ఓలు మాకు ముట్టి నట్టుగా రశీదు ఇవ్వమని అడిగగా ఆయన తీరస్కరించారు. అందువలను బిఎల్ఓలు వారు ఇచ్చిన నివేదికను తారు మారు చేస్తారేమో అని అనుమానం వ్యక్తం చేశారు.

స్వీయ మదింపు పరీక్షలు పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి: స్వీయ మదింపు పరీక్షలను మండల విద్యాశాఖ అధికారి 1 షేక్ మస్తాన్ వలి పరిశీలించారు. ఈ సందర్భంగా బుధవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గన్నేపల్లి, జిల్లా ఉన్నత పాఠశాల గడ్డం వారి పల్లి పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి జరుగుతున్న స్వీయ మదింపు పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీయ మదింపు పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. 1,2 తరగతులు అభ్యసించే విద్యార్థుల ఓఎంఆర్ షీట్లను ఉపాధ్యాయులు భర్తీ చేయవలెనని తెలిపారు. అదేవిధంగా 3 నుండి 8తరగతులు అభ్యసించే విద్యార్థులు ఓఎంఆర్ షీట్లను ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తగా భర్తీ చేసే విధంగా ఉపాధ్యాయులు తగు సూచనలు సలహాలు ఇవ్వాలని తెలిపారు. అనంతరం మనబడి మన భవిష్యత్తు పనులలో భాగంగా నిర్మించిన నూతన టాయిలెట్లను, ఎఫ్ఏ-1 పరీక్షలను,స్టడీ అవర్స్ పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య ,షేక్ జబీనా ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎంఇఒ మస్తాన్‌వలీ

అభివృద్ధి దాతలకు అభినందనలు

ప్రజాశక్తి-ఉదయగిరి: పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం ను మండల విద్యాశాఖ అధికారి తోట శ్రీనివాసులు అభినందించారు. బుధవారం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల బిజ్జంపల్లి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బిజ్జంపల్లి మెయిన్, ఉర్దూ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాల లో విద్యార్థులకు ఐడి కార్డ్స్, ఉన్నత పాఠశాల బిజ్జంపల్లి లో శుభ దిన్ భోజన్ మూలె రాజశేఖర్ రెడ్డి ప్రత్యూష వివాహ వేడుకలలో భాగంగా మూలె రాజశేఖర్ రెడ్డి మటుకుంది ప్రభాకర్ రెడ్డి దాతలు విద్యార్థులు అందరికీ భోజన వసతి కల్పించారు. వేదిక నిర్మాణానికి ఆర్థికంగా తోడ్పాటును ఇచ్చారు. పాఠశాల ముఖద్వారం కు కల్లూరి సిద్దారెడ్డి జ్ఞాపకార్థం కల్లూరి రవీంద్ర రెడ్డి సహరించారని వారిని అభినందించి అనంతరం వేదిక ముఖద్వారం గేటు భూమి పూజ కార్యక్రమాలలో ఎంఇఒ పాల్గొన్నారు. గ్రామ ఆర్ఎంపి డాక్టర్ నారాయణ రెడ్డి స్కూల్ అభివృద్ధిలో భాగస్వాములు అవుతామని తెలిపారు. అందరికి ప్రధానోపాధ్యాయులు పాఠశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్కు రమణమ్మ శ్రీనివాసులు చైర్మన్ అంకణ కవిత ఎస్ ఎం సి సభ్యులు జమ్ముల వెంకటేశ్వర్లు, షేక్ నాయబ్, గ్రామ పెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ నాయబ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-బిట్రగుంట: భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుక స్టాప్ పాయింట్లు ప్రభుత్వం బోగోలు మండలంలో ఏర్పాటు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి చల్లా నరహరి పేర్కొన్నారు. బోగోలు మండల భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం బోగోలు బజార్ సెంటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కార్యక్రమాన్ని వ్యవసాయ కార్మిక జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లూరి మాల్యాద్రి ,మండల సిఐటియు కార్యదర్శి చల్లా నరహరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, భవన నిర్మాణాలకు అవసరమైన ఇటుకలు ,సిమెంటు ప్రయివేటు వ్యక్తుల దగ్గర అధిక రేట్లు కైనా దొరుకుతున్నాయన్నారు. ,ఇసుక మాత్రం ఎక్కడ దొరకడం లేదని అన్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందిస్తామని మాటలకే పరిమితమైంది తప్ప ఇంతవరకు ఎవరికి అందడ లేదన్నారు.ప్రభుత్వం తక్షణమే ఇసుకను అందించాలని, బోగోలు మండల సిపిఎం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బోగోలు మండల సిఐటియు అధ్యక్షులు తుమ్మల సీనయ్య, వైస్ ప్రెసిడెంట్ ఎస్, కే బాదుల్లా, సెక్రటరీ తిరుపాల్, సమన్వయకర్త క్రిష్టయ్య, ఉపాధ్యక్షులు బ్రహ్మయ్య, జాయింట్ సెక్రటరీ ఎస్.కె షబ్బీర్ ,భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న దృశ్యం

ఏకలవ్య పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

గిరిజనాభివృద్ధికి ఎంతో ఊతమిచ్చే ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ అన్నారు. బుధవారం కొడవలూరు మండలంలోని చంద్రశేఖర పురంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన పరిశీలిం చారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా పాఠశాలకు చేరుకున్న ఎంపికి స్థానిక నాయకులు, పాఠశాల ప్రిన్సిపల్ విశ్వప్రతాప్ శుక్లా, ట్రైబల్ వెల్ఫేర్ పీడీ పరిమళ, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో అన్ని ప్రాంతాలను ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. మరుగుదొడ్లు పరిశీలించి డోర్లు లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్‌ను అడిగి వివరాలు ఆరా తీశారు. తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తగినంత మంది సిబ్బంది లేకపోవడంపై ఆరా తీశారు. ప్రయోగశాలలను పరిశీలించి ఏమేం వసతులున్నాయి, ఏం ఏర్పాటు చేయాలన్న దానిపై వివరాలు తెలుసుకున్నారు. ప్రాంగణంలో నిర్మించిన విద్యార్థుల భోజనశాల ప్రారంభానికి నోచుకోకపోవడంపై ఆరా తీశారు. భోజన శాలను త్వరలోనే ప్రారంభించి విద్యార్థుల ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. పాఠశాల ఆవరణలో అసంపూర్తిగా ఆగిపోయిన స్టేడియాన్ని పరిశీలించారు. బోధన, బోధనేతర సిబ్బంది నియామకంపై తప్పకుండా కేంద్ర గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి జుయల్ ఓరమ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... కేంద్ర గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి జుయల్ ఓరమ్ సూచనలతో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నట్లు చెప్పారు. ఏకలవ్య మోడల్ పాఠశాల కేవలం పేరుకే పరిమితమైందని, తప్పకుండా ఈ పాఠశాలను అభివృద్ధి చేస్తామన్నారు. దాదాపు 20 ఎకరాల్లో ఈ పాఠశాల ఉన్నా, అన్ని వసతులు ఉన్నా... సరిచేయాల్సిన విషయాలు చాలా ఉన్నాయని వివరించారు. ఇక్కడ ఉన్నవాళ్లలో చాలామంది హిందీ మాట్లాడే సిబ్బంది ఉన్నారని, దాంతో విద్యార్థులు ఏం చెబుతున్నారో అర్థం చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తప్పకుండా తెలుగు తెలిసిన సిబ్బందినే నియమిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. దాంతో కమ్యూనికేషన్ కూడా సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. పాఠశాల ఆవరణలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంపై ఆరా తీశారు. అలాగే నూతనంగా నిర్మించిన డైనింగ్ హాలును త్వరలోనే ప్రారంభించి విద్యార్థుల అవస్థలను పరిష్కరిస్తామన్నారు. గిరిజనాభివృద్ధే ధ్యేయంగా ఎంతో ఉన్నత ఆశయాలతో ఈ పాఠశాలను ఏర్పాటు చేశారని, తప్పకుండా ఈ పాఠశాలలో పూర్తిస్థాయి వసతులు కల్పించి గిరిజనుల ఉన్నతికి పాటుపడతామన్నారు. జిల్లాలోనే ఈ పాఠశాలను ఆదర్శ పాఠశాలగా అభివద్ధి చేస్తామని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యానాదుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎంపికి వినతి పత్రం అందించారు.కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ పీడీ పరిమళ, తహశీల్దారు స్ఫూర్తి, పాఠశాల ప్రిన్సిపల్ విశ్వ ప్రతాప్, టీడీపీ ముఖ్య నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, కొడవలూరు మండల టీడీపీ ముఖ్య నాయకులు, అధ్యాపక సిబ్బంది, గెస్ట్ ఫ్యాకల్టీ, అధ్యాపకేతర సిబ్బంది, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శీనయ్య, సభ్యులు పద్మ, చెంచుకృష్ణ, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

కావలి అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది

ప్రజాశక్తి-కావలి.

అభివృద్ధి పథంలో కావలి నియోజకవర్గం దూసుకుపోతుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. బుధవారం కావలి పట్టణం పాతూరులో ఎంపి నిధులతో ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యంలో రూ.9.5 లక్షల వ్యయంతో చేపట్టే రెండు సిమెంట్ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామిరెడ్డి వారి వీధిలో 4.5 లక్షల వ్యయంతో, కాటా వారి వీధిలో 5 లక్షల వ్యయంతో బుధవారం శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టడం జరిగిం దని తెలిపారు. కావలి పట్టణ అభివృద్ధి కోసం 10 కోట్లతో డిపిఆర్ తయారు చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపించారు. త్వరలోనేపనులుప్రారంభిస్తామన్నారు. ప్రతి ఇంటికీ నీరందించే లక్ష్యంతో రూ. 62 కోట్లతో ప్రారంభించిన అమృత్ పథకం పనులు పూర్తి కానున్నాయన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిని ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.కావలి పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంతో రూ.73 లక్షలతో కంప చెట్లను తొలగించడం, కాలువల పూడిక తీయించడం జరిగిందని తెలిపారు. ట్రంక్ రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఎంజిఆర్ కళ్యాణమండపం నుంచి మద్దూరుపాడు వరకు నాలుగు లైన్ల పనులు ప్రారంభమయ్యాయన్నారు. బృందావన కాలనీ నుంచి ముసునూరు వరకు పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. సెప్టెంబర్ ఒకటవ తేదీన తుమ్మలపెంట రోడ్డుకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని తెలిపారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడంతో అభివృద్ధి పనులు శర వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఈ.ఈ.గిరిధర్, డి.ఇ.విజయలక్ష్మి, మున్సిపల్ ,డి.ఇ.సాయిరాం, తహశీల్దార్ శ్రావణ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పోతుగంటి అలేఖ్య, స్థానిక నాయకులు చిలకపాటి శ్రీనివాసులు, జనిగర్ల మనోహర్, బొంతా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ కావ్యకృష్ణారెడ్డి

చెరువు ఆక్రమణలను తొలగించాలి

ప్రజాశక్తి-కావలి

హైదరాబాద్ తరహా హైడ్రా చట్టాన్ని తేవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లిపేర్కొన్నారు.బుధవారం ఆర్‌డిఒ కార్యాల యం ఎదుట ధర్నా నిర్వహించి, ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులుఎస్.మల్లిమాట్లాడుతూ కావలి డివిజన్‌లో ఒక పద్ధతి ప్రకారం చెరువుభూములను రియల్ ఎస్టేట్ వారికి దారా దత్తం చేస్తున్నారని తెలిపారు. భూస్వాములు చెరువు భూము లను ఆక్రమించుకొని కోట్లాది రూపాయలు చెరువు భూముల తో వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. కోవూరు పల్లి చెరువులో ఇటీవల కలెక్టర్.ఆదేశాల మేరకు విచారించగా ఐదుఎకరాల భూమి రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారుల సహకారంతో రియల్ ఎస్టేట్ వారు ఆక్రమణ చేసినట్లు తెలిసిందని చెప్పారు. రియల్ ఎస్టేట్ వారిపై గ్రామస్తులు ఫిర్యాదుచేయంగా 2ఎకరాలు మాత్రమే ఆక్రమణకు గురైనట్లు చెప్పారు. మరలా కలెక్టర్‌ను సంప్రదించగా, 3 ఎకరాలు చూపించారు. ఈవిధంగా ప్రతి చెరువు భూములను రియల్ ఎస్టేట్.వ్యాపారులు ఆక్రమించుకొని వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. ఏపార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వారి దగ్గరకు వెళ్లి వారి పనులు పూర్తి చేసుకొంటున్నారని తెలిపారు. పాపిరెడ్డి చెరువులో 19, 20 సర్వే నంబర్‌లో చెరువు భూములు 130 ఎకరాలు కాగా 30 ఎకరాలు మాత్రమే పాపిరెడ్డి చెరువు వుందని100 ఎకరాలు అన్యాక్రాంత మైందని తెలిపారు. ఈ విధంగా పురిణి, ఇందుపూరు చెరువులు అదృశ్యమయ్యాయని తెలిపారు. రెవెన్యూ,, ఇరిగేషన్ అధికారులు కుమ్మక్కై రాజకీయ నాయకులు చెప్పినట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఓ ప్రణాళిక రూపొందించి చెరువు భూములను కాపాడుతామని, రుద్రకోట చెరువులో గ్రావెల్ తవ్విన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ శీనా నాయక్ తెలిపారు. కార్యక్రమంలో సాదు ప్రసాద్, శ్రీనివాసులు, జరుగుమల్లి దయాకర్, నారుబోయిన లక్ష్మి నర్సు, జరుగుమల్లి ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న దళిత నాయకులు



సల్ఫైడ్ విషప్రభావ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-ఉదయగిరి: వరిలో సల్ఫైడ్ విషప్రభావం – కారణాలు, సవరించే మార్గాలపై సేద్య విభాగం కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ కె. కిరణ్ కుమార్ రెడ్డి, శాస్త్రవేత్త తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూపల్లపు ప్రాంతాలలో వరి పండించే పొలాల్లో మురుగు వసతి సక్రమంగా లేనప్పుడు వరిలో సల్ఫైడ్ దుష్ప్రభావాన్ని గమనిస్తామన్నారు. వరిలో ఇటువంటి పరిస్థితికి కారణం తగిన రీతిలో పంట వేర్లకు గాలి అందకపోవటం, నేలలో రసాయన చర్యల వలన మార్పు చెందడం. ఈ భూములలోగల సల్ఫేట్ రూపంలో ఉన్న గంధకం సల్ఫైడ్ రూపంలోకి మారుతుందన్నారు. సల్ఫైడ్ దుష్ప్రభావం సాధారణంగా బంక నేలల్లోను, కొత్తగా సాగులోనికి తెచ్చిన నేలల్లోను, ఇనుప ధాతు లోపం ఉన్న నేలల్లోను, మురుగు వసతి సక్రమముగా లేనప్పుడు కలుగుతుందన్నారు. 20-20-0-13 లాంటి కాంప్లెక్సులను అధికంగా వాడటం లేదా సింగిల్ సూపర్ ఫాస్పేట్‌ని గాని లేదా అమ్మోనియం సల్ఫేట్ గాని ఎక్కువగా వాడటం వలన ఈ సల్ఫైడ్ దుష్ప్రభావాన్ని పొలంలో గమనించవచ్చు. ఈ సల్ఫైడ్ దుష్ప్రభావం వలన వరి నేలల్లో, పంట మధ్యకాలంలో అక్కడక్కడ గుంపులు గుంపులుగా బాగా పెరిగిన పంట మొత్తం పసుపు వర్ణములోకి మారి ఎదుగుదల క్షీణిస్తుందన్నారు. పొలంలోకి దిగి గమనిస్తే మట్టి మెత్తగా ఉండి కాలు చాలా లోతుగా దిగబడిపోతుందన్నారు. మట్టి నుంచి కుళ్లిన వాసనను మనం గమనిస్తామన్నారు. పొలంలో నడుస్తున్నప్పుడు బుడగల రూపంలో గాలి బయటికి రావడం చూస్తామన్నారు. నేల నుంచి దుర్గంధపు వాసన మొక్కను వేర్లతో సహా బయటికి తీసినప్పుడు కుళ్ళిపోయిన గుడ్ల వాసన వస్తుందన్నారు. ఈ సల్ఫైడ్ దుష్ప్రభావం వలన మొక్కలు ఎదుగుదల క్షీణించి చనిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. దుష్ప్రభావం వలన 30-50 శాతం వరకు పంట దిగుబడి నష్టపోవడం జరుగుతుందని తెలిపారు.

పంటలో యాజమాన్య పద్ధతులు..

ఈ లక్షణములను గమనించిన వెంటనే అక్కడక్కడ పొలం అంతా ఒక అడుగు లోతున కాలువ తీసి నీటిని పొలం నుండి తీసివేయాలన్నారు. పొలాన్ని చిన్న చిన్న నెర్రెలు ఏర్పడేవరకు ఆరబెట్టాలన్నారు. తరువాత నీరు పెట్టాలన్నారు. అనువైన పరికరంతో పొలంలో చాళ్ల మధ్య మట్టి బాగా కదిలేలా చేయాలన్నారు. పైరు కోలుకున్న తరువాత నత్రజని ఎరువులు తప్పనిసరిగా వాడాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులుత

5న జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-ముత్తుకూరు : సెప్టెంబర్ ఐదో తేదీ రాష్ట్ర వ్యాపితంగా జరిగే విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల మహా ధర్నాను జయప్రదం చేయాలని ఎపి జెన్కో సిఐటియు గౌరవాధ్యక్షులు స్వర్ణ రమణరావు, అధ్యక్షులు చికిరి ఆదిశేషయ్య, ఉపాధ్యక్షులు నక్కా శ్యాం ప్రసాద్‌లు పిలుపునిచ్చారు. బుధవారం ఎపి జెన్కో ఫీల్డ్ హస్టల్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ జెన్కోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలను అరికట్టాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, నేలటూరు ఏపీ జెన్కోలో నెలకొని ఉన్న అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సెప్టెంబర్ 5వ తేదీ నాడు జరిగే మహా ధర్నాలో ఏపీ జెన్కో కాంట్రాక్ట్ కార్మికులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు ఏపీ జెన్కో జిల్లా కోశాధికారి కె.నాగరాజు, నేలటూరు ఏపీ జెన్కో కోశాధికారి బద్వేల్ వెంకటేశ్వర్లు, శేఖర్, భాస్కర్, పురుషోత్తం, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బదిలీలపై సిఎండిని కలిసిన నాయకులు

ప్రజాశక్తి-కావలి

: ఎపిఎస్. పి.డి.సి.ఎల్. సిఎండి కే . సంతోషరావుని బుధవారం ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రిజిస్టర్డ్ నెం: జి.445. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సి .రామ గోపాల్ రెడ్డి, టి.సాంబశివ రావులు కలిసి ట్రాన్స్ఫర్ గైడ్ లైన్స్ గురించి చర్చించారు. కార్యక్రమంలో కంపెనీ అధ్యక్ష , కార్యదర్శులు ఏ . శ్రీనివాసులు నాయుడు, కోటేశ్వరరావు ఇంకా యూనియన్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

గిరిజనులకు అన్నదానం

ప్రజాశక్తి-కావలి:కావలి పట్టణం, ఇందిరానగర్ నివాసులు మాజీ కౌన్సిలర్ గంధం ప్రసన్నాంజనేయులు వారి తండ్రి గారైన కీ.శే. గంధం.పిచ్చియ్య 43 వ వర్ధంతి సందర్భంగా సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో కావలి పట్టణం పెంకుల ఫ్యాక్టరీ చెరువు కట్ట గిరిజనులకు అన్నదానం చేశారు.కార్యక్రమంలో దాత గంధం. ప్రసన్నాంజనేయులు, సంయుక్త సేవా సంస్థ సభ్యులు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బుర్లా. రఘుకుమార్ రెడ్డి, పల్లపు. చిట్టిబాబు,ఆర్విడియస్. వెంకటేశ్వర్లు, వడ్డిపాలెం మాజీ కౌన్సిలర్ పల్లపు.సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీరువా బహూకరణ

ప్రజాశక్తి-కావలి: స్థానిక వెంగళరావు నగర్ లోని పురపాలక ఉన్నత పాఠశాలలోని ఎన్.సి.సి. 10(ఏ) నావెల్ యూనిట్‌కు బుధవారం బీరువాను 18వ వార్డు తెలుగుదేశం ఇన్‌ఛార్జి శానం హరి బహూకరించారు. ఇంతకు మునుపు ఎన్. సి.సి. ఆఫీసర్ తిప్పిరెడ్డి కొండారెడ్డిని సత్కరించే సందర్భంగా పాఠశాల ప్రధానోపా ధ్యాయులు హయ్యూల్ హయ్యుమ్ వినతి మేరకు బీరువాను బహూకరించారు.ఈ సందర్భంగా శానం హరి మాట్లాడుతూ తను ఈ పాఠశాలలోనే చదివానని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి గా ఎస్ఎంసి చైర్మన్ వైరింగం కల్లయ్య, వైస్ చైర్మన్ టి.సుభాషిణి, కమిటీ సభ్యులు బి.రమేష్ పాల్గొన్నారు.

హెచ్ఐవి నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కావలి: స్థానిక జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బుధవారం ఎం.ఎల్.టి.విద్యార్థులకు, పారిశుధ్య కార్మికులకు హెచ్.ఐ.వి./ ఎయిడ్స్, టి.బి. వ్యాధుల నివారణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సార్డ్స్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ రూత్ బేనోమి మాట్లాడుతూ హెచ్.ఐ.వి / ఎయిడ్స్ వ్యాధులను గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అంతేగాక విద్యార్థులు నేటి సంస్కృతిలో ఎంతటి ప్రమాదపు అంచున ఉన్నారని తెలిపారు.

రైలు పట్టాలపై మృతదేహం

ప్రజాశక్తి-బిట్రగుంట: బిట్రగుంట దక్షిణం రైల్వే గేట్ 144 గేట్ సమీపాన బుధవారం తెల్లవారుజామున దక్షిణం నెల్లూరు వైపు వెళుతున్న సూపర్ ఫాస్ట్ రైలు నుండి కిందపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడు బోగీ గేటు వద్ద కూర్చొని ఉండొచ్చునని నిద్రమత్తులో పడి ఉంటారని, వయసు సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ,పింక్ కలర్ చొక్కా ధరించి ఉన్నాడని స్థానికులు తెలిపారు.

తాగునీటి సరఫరా

ప్రజాశక్తి-కావలి: కావలి పాతవూరు నాల్గవ వార్డ్ లో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆయన అభిమానుల ద్వారా ట్యాంకర్ ల సహాయంతో బుధవారం మంచినీరు సరఫరా అందజేశారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెవరెండ్ డాక్టర్ గడ్డం రమేష్ ను పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు రెవరెండ్, గడ్డం హనోక్, రాష్ట్ర అధ్యక్షులు ఐ, ఎస్ , బే నహర్ బాబులు బుధవారం నియమించారు. ఈ సందర్భంగా రెవరెండ్ డాక్టర్ గడ్డం రమేష్ బాబు మాట్లాడారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జాషువా తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ కేంద్రంలో అన్నదానం

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు మండలం ముంగమూరు రోడ్డు జాతీయ రహదారి పక్కన ఉన్న భవాని ఎడ్యుకేషనల్ సొసైటీలో బుధవారం పైడి అబ్రహం జ్ఞాపకార్థంగా వారి కుమారులు పైడి హర్ష ,పైడి చైతన్య ఆదరణ కేంద్రం లోని సభ్యులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా తండ్రి జ్ఞాపకార్థ కార్యక్రమాన్ని ఆదరణ కేంద్రంలో ప్రతి సంవత్సరం జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆదరణ కేంద్రాన్ని నిర్వహిస్తున్న డాక్టర్ కట్టిపల్లి సింహాద్రి ,భవనీ లకు ధన్యవాదాలు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-సంగం: మండలంలోని దువ్వూరు గ్రామంలో అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టను వైభవంగా నిర్వహించారు. ముందుగా ప్రత్యేక హోమాలు నిర్వహి ంచి.. అనంతరం స్వామి వారి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో అర్చకుల వేదమంత్రాల తో అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పలుచోట్ల ఎస్ఐల బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-మర్రిపాడు: మండల పోలీసుస్టేషన్ నూతన ఎస్ఐగా కె శ్రీనివాస రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జూదం, అక్రమ మద్యం, గంజాయి పైప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. నెల్లూరు ముంబై జాతీయ రహదారి పై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామన్నారు.ఎస్ఐకి సిబ్బంది ఆత్మీయ స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజాశక్తి-దగదర్తి :దగదర్తి ఎస్ఐగా జంపాని కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో టిపి గూడూరులో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల బదిలీల కారణంగా దగదర్తికి పోస్టింగ్ పడడంతో బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కోడి పందేలు, పేకాట కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తహశీల్దారును సన్మానిస్తున్న దృశ్యం

తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి-మర్రిపాడు: ఇటీవల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జె స్వప్న, ఎస్ఐ శ్రీనివాస రావులను కూటమి నాయకులు శాలువా కప్పి పుష్ప గుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.మండలంలో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించాలని కోరారు. మండలంలో శాంతి భద్రతలు కాపాడుతూ,, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు జనార్ధన్ నాయుడు, మాజీ మండల అధ్యక్షులు నారాయణ, టీడీపీ సీనియర్ నాయకులు లక్ష్మీ నరసయ్య, పావులూరి వెంకట్రామయ్య, మధుసూదన్ రెడ్డి, కర్యావుల శ్రీనివాసులు, గుమ్మా రవీంద్రా రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

ప్రజాశక్తి-అనంతసాగరం: మండలంలోని 25 గ్రామాలకు 2024-25 సంవత్సరం గాను 15వ ఆర్థిక సంఘం నిధులు విడు దలైనట్లు మండల ప్రజా అభివృద్ధి అధికారి ఏ మధు సూదన్ రావు బుధవారం తెలిపారు. మండలంలోని 55 లక్షల 50వేల ఎనిమిది వందల పద్నాలుగు రూపాయలు గ్రాంట్ విడుదల చేసినట్లు తెలిపారు. తాగునీటి అవసరాలకు, పారిశుధ్యం పనులకు, వీధిలైట్లు నిర్వహణకు బేసిక్ గ్రాంట్ వినియోగించుకోవచ్చని తెలిపారు.

పోలీస్ స్టేషన్లో సిఐ తనిఖీ

ప్రజాశక్తి-అనంతసాగరం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆత్మకూరు సిఐ గంగాధర్ రావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్లోని రికార్డులను పరిశీలించారు. రాత్రి సమయంలో గస్తీ ముమ్మరం చేయాలని ఎస్ఐ సూర్యప్రకాశ్ రెడ్డి ని ఆదేశించారు. రికార్డులు పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

అరుగు తొలగింపు పై ఫిర్యాదు...

ప్రజాశక్తి-మర్రిపాడు: మండల కేంద్రంలోని నెల్లూరు ముంబై జాతీయ రహదారి పక్కనే ఉన్న వైఎస్ఆర్ విగ్రహం చుట్టూ ఉన్న గ్రానైట్ అరుగు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ మాజీ కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు ఎస్ఐ కు ఫిర్యాదు చేశారు. ఆగస్టు 27వతేదీ రాత్రివైస్సార్ విగ్రహం ముందు జె సిబి సహాయంతో చదును చేయడంతో వైస్సార్ విగ్రహం చుట్టూ ఉన్న గ్రానైట్ రాయి అరుగు,విగ్రహం దెబ్బతిందని కారకులైన వారిని విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి మర్రిపాడు వస్తున్నారని ఆయన ఆధ్వర్యంలో నియోజక వర్గం వ్యాప్తంగా నిరసనలు ఆందోళనలు చేస్తామని తెలిపారు. ఆయన వెంట మండల యువజన నాయకులు నారాయణస్వామి, విష్ణు విజయ్ కుమార్ తదితరులున్నారు.